అనుదినం జనపక్షం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 29 ఏప్రిల్ 2023
1

కార్మికులకు ఉద్యోగోన్నతి పత్రాలు అందజేత



నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1 గనిలో వివిధ కేటగిరీలకు సంబంధించిన 37 మంది కార్మికులకు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, గని మేనేజర్ విజయ్ కుమార్, జీఎం చర్చల ప్రతినిధులు లక్ష్మణ్, వెంగళకుమారస్వామి ఉద్యోగోన్నతి పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఉద్యోగోన్నతి పొందడం చాలా సంతోషకరమన్నారు. ఉద్యోగోన్నతితో పాటు బాధ్యత కూడా పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని ఫిట్ సెక్రటరీ వెంబడి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ తిరుపతిరావు, గని సంక్షేమ అధికారి పాలకుర్తి రాజు, కార్మికులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన పనులకు శంకుస్థాపన



వేమనపల్లి : మండలంలోని నీల్వాయి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ కింద రూ.16లక్షలతో ఏర్పాటు చేస్తున్న పల్లె దవాఖాన పనులను శుక్రవారం నీల్వాయి ఎంపిటిసి ఆర్.సంతోష్ కుమార్, సర్పంచ్ గాలి మధు, డిఈ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్, ఎఈ రాజేశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాఫీజా బేగం, వార్డు సభ్యులు మహేందర్, రాంరెడ్డి, సక్కుబాయి, ఈర్ల అరుణ, పూర్ణచందర్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ చందు, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, హెల్త్ సూపర్ వేజర్ సరోజన, ఎఎన్ఎంలు తిరుపతమ్మ, కళావతి, ఎఈ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులర్ ఉత్తర్వులు ఇచ్చేవరకూ సమ్మె

- జేపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాటవేణి కృష్ణ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూనియర్ పంచాయతీ సెక్రటరీలకు రెగ్యులర్ ఉత్తర్వులు ఇచ్చేవరకు సమ్మె యథాతథంగా కొనసాగుతుందని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాటవేణి కృష్ణ అన్నారు. రెగ్యులర్ ఉత్తర్వులు ఇవ్వాలనే డిమాండ్‌తో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీవో ప్రకారం 11 ఏప్రిల్ 2023 నుండి తమ సర్వీసులు రెగ్యులర్ చేయాల్సి ఉందన్నారు. గతంలో ఇచ్చిన సమ్మె నోటీసు ప్రకారం శుక్రవారం నుండి విధులు బహిష్కరించామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్‌గౌడ్, కోశాధికారి ప్రదీప్ గౌడ్, గౌరవ అధ్యక్షులు మల్లేష్, రాకేష్, ఉపాధ్యక్షులు మల్లీశ్వరి, మనీష్, వంశీ, ప్రేమ్‌సాగర్, జాయింట్ సెక్రటరీలు వికాస్, తిరుపతి, శ్రీకాంత్, రవికుమార్, సభ్యులు శ్రీనివాస్, హరిదాస్, మారుతి, శ్రీజ పాల్గొన్నారు.

భీమిని : రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు శుక్రవారం నుండి సమ్మెకు దిగారు. నియామక సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు మూడేండ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, నాలుగేండ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్‌గా గుర్తించాలని, ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెకు మండల పరిషత్ సిబ్బంది, ఎంపిఈఓ సఫ్దర్ అలీ, జూనియర్ అసిస్టెంట్ లలిత, ఏపిఓ భాస్కర్ మద్దతు తెలిపారు.

వేమనపల్లి : జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు తమను క్రమబద్ధీకరించాలని సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఓ ప్రకారం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారణ చేయడంతో పాటు అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. 317 జీఓ వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని, పరస్పర బదిలీలకు అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు తోడే సంతోష్‌రెడ్డి, కార్యదర్శి మహమ్మద్ సిరాజుద్దీన్, సభ్యులు పోశం, యూసుఫ్, సురేష్, జాఫర్, సుదర్శన్, సాయిరాకేష్, వెంకటేష్, హరనాథ్ పాల్గొన్నారు.

జన్నారం : జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగాలను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, మధు, సరిత, ప్రధాన కార్యదర్శి అజాస్, కోశాధికారి శ్రీకాంత్, సాగర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

కాసిపేట : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగారు. బీజేపీ నాయకులు కొయ్యల ఏమాజి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు బీజేపీ మద్దతు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అట్కపురం రమేష్, మండల ఉపాధ్యక్షులు పోషం, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్దన్, కన్నెపల్లి మండల అధ్యక్షులు బేరే రామన్న యాదవ్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, అజ్మీర శ్రీనివాస్ పాల్గొన్నారు.


భీమిని :


జన్నారం :

గల్ఫ్ కార్మికునికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గోనె ఆశన్నకు రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యులు సేకరించిన విరాళాలు రూ.35,800 అందజేశారు. ఆశన్న సంవత్సరం క్రితం జీవనోపాధికి దుబాయ్ వెళ్లాడు. కంపెనీలో వర్క్ చేస్తున్న సమయంలో కంటికి బలమైన దెబ్బ తగిలింది. కంపెనీ యజమాన్యం చికిత్స చేయకుండా స్వదేశానికి పంపించింది. కంటి చికిత్సకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో గల్ఫ్ సంక్షేమ సమితి రాష్ట్ర నాయకులు సేపురి గోపాల్, పాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి గల్ఫ్ బోర్డు కావాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు లేకపోతే గల్ఫ్ కార్మికులకు ఎన్నటికీ న్యాయం జరగదన్నారు. రాబోయే ఎన్నికల్లో గల్ఫ్ కార్మికులంతా ఏకమై ఎన్నికల్లో పోటీ చేయాలని, గల్ఫ్ కార్మికులు చట్టసభల్లో ఉంటే గల్ఫ్ బోర్డు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పులిశెట్టి నాగేష్, శివనూరి శ్రీనివాస్, జాలపెల్లి మల్లారెడ్డి, ఉప్పు తిరుపతి, మహేష్, గోనె భూమన్న పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సవరించాలి



నవతెలంగాణ - కౌటాల

ఓటరు జాబితాను సవరించాలని కాగజ్‌నగర్ ఆర్‌డీఓ జాడి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, గతంలో అర్హులైన వారి ఓటరు లిస్టులో పేరు లేనివారికి 6-ఎ ఫారంను పూర్తిచేయించి ఓటరు లిస్టులో నమోదు చేయాలని తహసీల్దార్ సాయన్నకు సూచించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి పనులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని పనులు జరిగేలా చూడాలని సూచించారు.

విద్యుత్ బకాయిలు చెల్లించి సహకరించాలి



జైనూర్ : మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి సహకరించాలని ఏఈ సాదిక్‌పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు 26 గ్రామ పంచాయతీల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి విద్యుత్ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా మండల కేంద్రంలో సుమారు రూ.రెండు కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. సమయానికి బిల్లులు అందించకపోవడంతో విద్యుత్ శాఖ ఆర్థికంగా ఇబ్బందికి గురవుతుందని తెలిపారు. మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో నేటి నుండి 30 వరకు ప్రత్యేక బృందాలతో పోల్ టు పోల్ సర్వే నిర్వహించి బకాయిలు వసూలు చేస్తామని పేర్కొన్నారు. దాని కోసం ప్రతి ఒక్కరు సహకరించి సమయానికి బిల్లు కట్టి విద్యుత్ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లిస్తే విద్యుత్ శాఖకు ఎంతో లాభం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్ : డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్శిటీ డిగ్రీలో ప్రవేశం పొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలని కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెమిస్టర్-6 విద్యార్థులు మే 10వ తేదీలోగా, సెమిస్టర్-2, 4 విద్యార్థులు మే 12వ తేదీలోగా ఫీజు చెలించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. టీఎస్ ఆన్‌లైన్ లేదా, ఏపీ ఆన్‌లైన్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా ఈ ఫీజు చెల్లించవచ్చని సూచించారు. సైన్స్ విద్యార్థులు అదనంగా ప్రాక్టికల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9866398678లో సంప్రదించాలని సూచించారు.

నేడు రైతువేదికలో రక్తదాన శిబిరం

వేమనపల్లి : మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం రెవెన్యూ, రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ హాజరవుతారని తెలిపారు.

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి క్రీడా శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. మే 1 నుండి 31 వరకు అథ్లెటిక్, హ్యాండ్ బాల్, హాకీ, కబడ్డీ, తైక్వాండో, వాలీబాల్, సాఫ్ట్ బాల్ వంటి క్రీడలపై గ్రామీణ ప్రాంతాల్లో 16, పట్టణంలో 5 శిక్షణ శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎక్కువగా మొబైల్ గేమ్స్‌కు అలవాటుపడకుండా ఈ క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థులు, క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ క్రీడా శిక్షణ శిబిరాల విజయవంతానికి పిఇటిలు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాతినిధులు ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ శిబిరాల పిఇటిలకు క్రీడా సామాగ్రిని అదనపు కలెక్టర్ అందజేశారు. అనంతరం నిర్వహించిన మాజీ సైనికుల సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫలాలను మాజీ సైనికుల కుటుంబాలకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 768 మంది మాజీ సైనికుల కుటుంబాలకు గుర్తింపు కార్డులను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్, గిరిజన క్రీడల అధికారి పార్థసారధి, జిల్లా ఒలంపిక్ క్రీడల అధ్యక్షులు బి.గోవర్ధన్‌రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్ దాస్, మాజీ సైనికులు, పిఇటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఓఏలకు అండగా ఉంటాం : విశ్రాంత ఉద్యోగుల సంఘం



నవతెలంగాణ - కాగజ్‌నగర్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపడుతున్న వీఓఏలకు విశ్రాంత ఉద్యోగుల సంఘం అండగా ఉంటుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎం. జయదేవ అబ్రహం తెలిపారు. వీఓఏలు చేపడుతున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులుగా తమ న్యాయమైన కోర్కెల పరిష్కారానికి సమ్మె చేస్తున్న వీఓఏల ఉద్యమ స్ఫూర్తి అభినందనీయమన్నారు. వీఓఏలకు నెలకు రూ.3,900 గౌరవ వేతనం చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయించుకోవడం అన్యాయమన్నారు. రూ.26000 గౌరవ వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగించాలని వీఓఏలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అల్లి రాజయ్య, బావండ్లపల్లి నర్సయ్య, ఏఎస్ఆర్ మూర్తి, షేక్ మెహబూబ్, ఎం.సుభాష్, జి. శ్యాంసుందర్, ఎస్.ప్రకాష్, శివరాం, నారాయణ, శివలింగం, కనకయ్య పాల్గొన్నారు.

జైనూర్ : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఓఏల సంఘాల నాయకులు అతిక్ అన్నారు. శుక్రవారం సమ్మెలో భాగంగా వీఓఏలు భిక్షాటన చేశారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. తహసీల్దార్ సమీర్‌హైమద్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, బ్యాంకు మేనేజర్ గోపాలకృష్ణతో పాటు పలువురిని భిక్షమడిగి ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న వీఓఏలను కార్మికులుగా గుర్తించాలన్నారు. వీఓఏలతో పాటు మహిళా సమాఖ్య మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వీఓఏలు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.

కొనసాగుతున్న ప్రజా పోరుయాత్ర



నవతెలంగాణ -వేమనపల్లి

మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రేగుంట చంద్రశేఖర్ నేతృత్వంలో చేపట్టిన ప్రజా పోరుయాత్ర నీల్వాయి, క్యాతనపల్లి, ముల్కలపేట గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి మామిడాల రాజేశం పాల్గొని మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కొరకు సిపిఐ చేస్తున్న ప్రజా పోరు యాత్రను ప్రజలు ఆదరించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, నియోజకవర్గంలో ప్రతి ఇంటికి గోదావరి నీరు అందించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ప్రతి ఎకరానికి సాగునీరు, అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల బతుకులను అస్తవ్యస్తం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాప కింద నీరులా మతోన్మాద శక్తులు దేశంలో రాజ్యమేలాలని ప్రయత్నిస్తున్న తరుణంలో ప్రజలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అందే పురుషోత్తం, బొంతల లక్ష్మీ నారాయణ, గుండ చంద్ర మాణిక్యం, బియ్యాల ఉపేందర్, అడెపు రాజమౌళి, కొంకుల రాజేష్, చిన్న శంకర్, దేవరబోయిన బాపు, శీలం చంద్రయ్య, రత్నం రాజం, బండారి శంకర్, వినోద్, అందే మహేష్, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోకపోవడం దారుణం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోకపోవడం దారుణమని బీజేపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. నష్టపోయిన రైతుల కోసం శుక్రవారం స్థానిక రాజీవ్‌చౌక్‌లో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల సిర్పూరు నియోజకవర్గంలో 27 వేల ఎకరాల యాసంగి పంట నష్టపోయిందని, స్థానిక ఎమ్మెల్యే కోనప్ప కనీసం రైతులను పరామర్శించకుండా ముఖం చాటేశాడని విమర్శించారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లిస్తే ఈ రోజు రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, వీరభద్రచారి, నరసింహారెడ్డి, ఆత్మారాంనాయక్, సిందం శ్రీనివాస్, చిప్ప మౌనిక పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి


ఎంపీ సోయం బాపురావు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అకాల వర్షాల వల్ల జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల వల్ల వరితో పాటు మొక్కజొన్న తదితర పంటలు నష్టానికి గురయ్యాయన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నికలకు ముందు ఒక మాట, ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతోందని, రైతులకు ఇస్తానన్న రుణమాఫీ ఇప్పటి వరకు అతీగతి లేదని అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని, అవినీతికి పాల్పడుతున్నారని సాక్షాత్తు సీఎం కేసీఆరే అంగీకరించారని, దీన్ని బట్టి చూస్తే ఈ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వమని అర్థం అవుతోందని అన్నారు. ప్రజలు దీన్ని గమనించి రాబోయే ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ నెల 30న ప్రధాని నరేంద్రమోడీ పర్చువల్ ద్వారా నిర్వహించే మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బూత్ స్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు దోని శ్రీశైలం, ఎస్ మురళీ, నాయకులు కొంగ సత్యనారాయణ, అజ్మీర ఆత్మారాంనాయక్, మాచర్ల శ్రీనివాస్, వీరభద్రచారి, వందన, రాణి పాల్గొన్నారు.

ఎంపీ జన్మదిన వేడుకలు

బీజేపీ కార్యాలయంలో ఎంపీ సోయం బాపురావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు తీసుకొచ్చిన కేక్‌లను ఆయన కట్ చేశారు. శాలువాలతో సత్కరించారు.

ఎక్కువ మందికి కంటి పరీక్షలు నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వీలైనంత ఎక్కువ మందికి కంటి వెలుగు కార్యక్రమం కింద పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలోని బూరుగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు శిబిరం కొనసాగాలని తెలిపారు. ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకొని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కంటి ఇబ్బందులు ఉన్నవారికి కళ్లద్దాలు, ఇవ్వడంతో పాటు ఆపరేషన్ కూడా ఉచితంగా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శిల్ప మోహన్, సిబ్బంది రషీద్ పాల్గొన్నారు.

నేడు మెడికోలకు స్కాలర్‌షిప్‌లు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఈనెల 29న ఆదిలాబాద్ రిమ్స్ లో 25మంది మెడికోలకు స్కాలర్షిప్లు అందించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అశోక్, శ్యామ్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీఎస్ రావ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఐఎంఏ ఆధ్వర్యంలో మెడికోలకు స్కాలర్షిప్లు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.

సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

అంగన్వాడీ కార్యకర్తలు లైఫ్ సేవింగ్ ట్రిక్ సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ కామేశ్వర్ అన్నారు. శుక్రవారం ఐ సిడిఎస్ కార్యాలయ ఆవరణలో ప్రాజెక్టు పరిధిలోని ఖానాపూర్, పెంబి మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. మనిషి రూపంలో ఉన్న బొమ్మను తీసుకొని సూపర్వైజర్ శ్రీలత అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సరిత, హెల్త్ ఎడ్యుకేటర్ జయలలిత, హెల్త్ సూపర్‌వైజర్ కొమురయ్యలతో పాటు వైద్య సిబ్బంది తదితరులున్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ -ఖానాపూర్

అకాల వర్షం, ఈదురుగాలుల కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కె.సర్దార్ అన్నారు. స్థానిక విశ్రాంతిభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత వారం రోజుల నుంచి అకాల వర్షాలు ఈదురుగాలులతో మామిడి,వరి, నువ్వు ,మక్కజొన్న, జొన్నలు, తదితర పంటలు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన పంటలపై అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. రూ.లక్షలు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెడితే అకాల వర్షంతో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పోయిన రైతాంగానికి ఎకరానికి రూ.25 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గోపీ నర్సయ్య, సహాయ కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, నాయకులు గొనే స్వామి,ప్రసాద్,గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

మేడే ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

కార్మికుల హక్కుల సాధనకై నిర్వహించే మేడేను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా మేడే కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలలో పని చేస్తున్న కార్మికులందరికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో నిర్వహించుకునే మేడే ను అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మండల సమైఖ్య సభ్యులకు యూనిఫాం పంపిణీ

నవతెలంగాణ- కడెం

కడెం మండలంలోని ప్రియదర్శిని మండల సమైఖ్య ఈసీ సభ్యులకు డిఆర్‌డిఓ విజయలక్ష్మిచే అందజేయబడిన యూనిఫామ్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజారాం, సీసీలు స్వామి, నర్సయ్య, విట్టల్, జ్యోతి, అకౌంటెంట్ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని రాచపూర్, చామనపల్లి గ్రామలలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటు ధరకు రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సురేందర్‌రెడ్డి తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, కృష్ణారెడ్డి, రైతు సమన్వయ సమితి చైర్మెన్ శాతం గంగారాం, సర్పంచ్‌లు శాతం బొర్రవ్వ, పడిగేల గంగాధర్, జహీర్, నిర్వాహకులు శంకర్, మహిపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు శిబిరాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం భుక్తాపూర్‌లోని కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మెన్ సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ రెండో విడత కంటివెలుగు విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు. ఈ కంటి వెలుగులో వయసుకు పరిమితం లేకుండా సేవలందించడం జరుగుతుందని శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారికి కండ్లద్దాలతో పాటు మందలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కంటి సమస్యలను దూరం చేయడానికి ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ ప్రకాష్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన వచ్చే నెల 10 నుండి 12 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపెల్లి దీక్ష భూమిలో పీఠాధిపతి ప్రేమ్‌సింగ్ మహారాజ్ చేతుల మీదుగా వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కరపత్రాలను విడుదల చేశారు. మూడు రోజుల పాటు సాయంత్రం భగవత్ పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు బాలాజీ జాదవ్, రాథోడ్ దత్తారాం, భిక్కు చౌహాన్, పవార్ భారత్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్, ఆడే ప్రతాప్ ఉన్నారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

పట్టణంలోని శ్రీ వాసవి మాత కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం అమ్మ వారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆలయ అర్చకులు సరస్వతి అభిషేక్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులకు కనువిందు చేస్తున్నారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఈ నవరాత్రుల సందర్భంగా ఆలయం భక్తులతో కూడికల్లాడుతుంది. రూ.11,11,111 రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరించామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

టీఏజీఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భద్రాచలం పట్టణంలో వచ్చే నెల 5, 6తేదీల్లో జరిగే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్)రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పూసం సచిన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మహాసభలకు సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ఆదివాసీల హక్కుల రక్షణ, రాజ్యాంగ హక్కుల సాధనకై టీఏజీఎస్ పోరాడుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడవుల ప్రవేటీకరణ పేరుతో ఆదివాసులను అడవులనుండి దూరం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఆదివాసీల హక్కులు కాలరాస్తూ ఆదివాసీలను వారి హక్కులను అణిచివేస్తూ హక్కులకై పోరాడిన ఆదివాసీలను దేశ ద్రోహులుగా జైళ్లలో వేస్తుందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని నాలుగేండ్ల నుండి చెబుతున్న ఇవ్వకుండా ఫారెస్ట్ అధికారులతో దాడులు చేయిస్తు వారిని భూములనుండి వెళ్లగొడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చించి వాటికీ వ్యతిరేకంగా ఈ మహాసభల్లో పోరాట రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు జాతీయ నేతలు బృందా కరత్, మిడియం బాబురావు, వివిధ రాష్ట్రాలు, వివిధ జిల్లాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు లంకా రాఘవులు, నేతలు మడవి లక్ష్మణ్, కుంర రాము, కుంర అయ్యు, రాజు పటేల్ పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయు జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

నవతెలంగాణ-ఉట్నూర్

ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఐకేపీ కార్యాలయం ముందు చేస్తున్న దీక్షలు శుక్రవారంతో 12వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు సీఐటీయు జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ఐకేపీ ఉద్యోగులకు సెర్ప్ ఉద్యోగులుగా ప్రకటించిన విషయం అందరికి తెలిసిందే. ఐకెపిలో విఓఎలు విధులు నిర్వహిస్తున్న వారిని కూడా సెర్ప్ ఉద్యోగులగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అందరికి కనీస వేతనం రూ.26వేలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్యబీమా కల్పించాలన్నారు. జాబ్ చార్ట్‌తో సంబంధం లేని ఇతర పనులను చేయించకూడదన్నారు. అర్హులైన విఓఏలను సీసీలుగా పదోన్నతులు కల్పించాలని లేని పక్షంలో ఉద్యమాలను మరింత ఉదతం చేస్తామని తెలిపారు.

తాంసి : ఐకేపీ వీఓఏలు కోరిన న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీసీసీ సభ్యుడు డా.వన్నెల అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో ధర్నాలు, రాస్తారోకోలు లేకుండా అందరికీ న్యాయం చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వాటన్నింటిని మర్చిపోయారని ఎద్దేవా చేశారు. భీంపూర్ మండలంలో వీఓఏలు బిక్షాటన చేసి నిరసన తెలిపారు. వీఓఏలకు సీపీఐ మండల కార్యదర్శి చిలుక దేవిదాస్ మద్దతు తెలిపారు. పార్టీ నాయకులు గంగారాం, సంతోష్, హన్మండ్లు, స్వామి, తదితరులున్నారు.



నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

- మున్సిపల్ సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకుంటున్న ప్రత్యేక చర్యల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తడం లేదని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. ఈ సందర్భంగా పురపాలక కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, లైన్ మెన్లు, బిల్ కలెక్టర్ ల వేతనాలకు సంబంధించిన ఎజెండాను సమావేశంలో ప్రవేశపెట్టగా... మెజారిటీ సభ్యులు ఆమోదం తెలపడంతో సమావేశం ముగిసింది. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పారిశుద్ధ్య కార్మికులకు ఏకంగా మూడు సార్లు వేతనం పెరిగిందని గుర్తు చేశారు. పెరిగిన వేతనంతో కూడిన ఎరియల్స్ ను సైతం జమ చేస్తున్నామని తెలిపారు. పరిసరాలను ప్రతినిత్యం శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల శ్రమను గుర్తిస్తూ వారికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూస్తున్నామని స్పష్టం చేశారు. తాజాగా చేపట్టిన మరమ్మత్తుల కారణంగా ప్రస్తుతం తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని వివరించారు. మున్సిపల్ కమీషనర్ శైలజ, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని సంఘం ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మెను చేపట్టారు. విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ న్యాయమైన డిమాండ్‌లను నేరవేర్చాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల ప్రొబిషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. నాలుగు సంవత్సరాలుగా గ్రామాల్లో పల్లెల అభివృద్ధికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అనేక సేవలు అందించారని అన్నారు. 15 రోజుల కింద కమిషనర్‌కు సమ్మెకు దిగుతామని నోటీస్ ఇచ్చామని అన్నారు. గురువారం జరిగిన చర్చల్లో కూడా ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదని అన్నారు. తమను రెగ్యులర్ చేయడంతో పాటు అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు ఉన్నారు.

వివిధ పార్టీలు, సంఘాల నాయకుల సంఘీభావం...

రాష్ట్ర ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన బాట పట్టారు. సమ్మెలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మూకుమ్మడిగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రొహిబేషన్ పీరియడ్ పూర్తయినప్పటికీ క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు పలుమార్లు కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మా సమస్యపై దృష్టిసారించి రెగ్యూలర్ చేస్తూ జీఓ జారీ చేయాలని స్పష్టం చేశారు. వీరికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి మద్దతు తెలిపారు.



సీఎం కేసీఆర్ పాలనలోనే రామరాజ్యం



నవతెలంగాణ- జైనథ్

అన్ని కులమతాలను గౌరవిస్తూ ప్రశాంతతను నెలకొల్పుతూ ముందుకు సాగినప్పుడే రామరాజ్యం అవుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కొంతమంది కుల, మతాల పరంగా రాజకీయం చేస్తూ ప్రశాంతకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారికి ప్రజలే బుద్ధిచెప్పాలని పేర్కొన్నారు. శుక్రవారం జైనథ్ మండలం గూడా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి రిబ్బన్‌కట్ చేసి ఆలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు అందించిన విరాళంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలతో ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆధ్యాత్మికతకు పెంపొందిస్తూ ప్రజానీకం భక్తి మార్గంలో నడిచేలా పలు మహోన్నతమైన దైవ కార్యాలను చేపట్టడమే కాకుండా రూ.వెయ్యి కోట్లతో యాదాద్రి ఆలయ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, రైతు సమన్వయ అధ్యక్షులు లింగారెడ్డి, ఎంపీటీసీ రమా రమేష్, సర్పంచ్ ప్రభాకర్, గోవర్ధన్,పురుషోత్తం, వైస్ మార్కెట్ చైర్మన్ వేణు యాదవ్, భోజన్న, కందూరి ఉషన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ - తాంసి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే శుక్రవారం తాంసి మండల కేంద్రానికి చెందిన విజయ్‌తో పాటు మరో వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై ఉదయం పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో పొన్నారి సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు దగ్గర మోటార్ సైకిల్‌ను ఎదురుగా వచ్చిన మ్యాక్స్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడ్డారు. చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు. వాహనాన్ని తాంసి పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 30వ తేదీన 12 పరీక్షా కేంద్రాలలో 4, 820 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ తుది రాత పరీక్షలో పాల్గొననున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రం పరిసరాలలో మరే ఇతర వ్యక్తులను అనుమతించడం జరగదని తెలిపారు. అభ్యర్థులు ఎటువంటి సందేహాలు లేకుండా నిశ్చింతగా పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు పాటించవలసిన కొన్ని నియమ నిబంధనలు తెలియజేశారు. పరీక్ష సమయం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఉంటుందని విద్యార్థులు ఉదయం 8.45గంటలకే పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10గంటల కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్‌లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, అభ్యర్థులు తమ వెంట పరీక్ష హాల్ టికెట్, పెన్, ప్యాడ్, పెన్సిల్ తీసుకొని రావచ్చున్నారు.

'రిజర్వేషన్ ఉండాలంటే కాంగ్రెస్ రావాల్సిందే'

నవతెలంగాణ- పెంబి

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే మైనారిటీ లకి ఉన్న 4శాతం రిజర్వేషన్ తీసేస్తామనడం అమిత్ షా అహంకారానికి నిదర్శనమని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా వినోద్‌నాయక్ మాట్లాడుతూ 2005 లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మైనారిటిలకు 4శాతం రిజర్వేషన్ కల్పించడంతో ఎంతో మంది విద్య,ఉద్యోగ అవకాశాలు పొందారు అని, ఇవాళ బీజేపీ నాయకులు వచ్చి రిజర్వేషన్ తీసేసి మైనారిటీలకి అన్యాయం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు స్వప్నిల్ రెడ్డి, సీనియర్ నాయకులు వసంత్, గంగాధర్‌నాయక్, గొల్ల రాజన్నసాయి, శ్రీకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

మంగ్లి గ్రామంలో వైద్య శిబిరం



నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ రూరల్ మండలం మాంగ్లి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ ఆదేశంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాహుల్, డా.ఈశ్వర్ సిబ్బందితో గ్రామానికి వెళ్లి వైద్యసేవలందించారు. గర్భిణీలు, చిన్నారులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు మర్సుకోల లక్ష్మీబాయి, ఆరోగ్య సేవకులు పవార్ ప్రేమ్‌సింగ్, మోతి, ఆశా వర్కర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమి నుండి రోడ్డు వేయడం అక్రమమే

నవతెలంగాణ- భైంసా

పట్టా భూమి నుండి రోడ్డు వేయడం అక్రమమేనని కనీసం ఆ రైతుకు సమాచారం ఇవ్వకుండా రోడ్డు ఎలా వేస్తారని భైంసా ఆర్డీవో రవి గ్రామ ఉపసర్పంచ్‌ను ప్రశ్నించారు. రైతు ఫిర్యాదు మేరకు కుంసరా గ్రామానికి వెళ్లి రోడు వేసిన భూమిని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. రోడ్డు వేసిన సర్పంచ్, కాంట్రాక్టర్ ప్రస్తుతం ఎందుకు లేరని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గ్రామస్తులు, పట్టాదారులతో చర్చలు కొనసాగించిన ఆయన చట్టరిత్యా నేరమైన పనులు చేయరాదని సూచించారు. సంబంధిత నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తానని రైతు మేడిపల్లి దేవేందర్‌కు తెలిపారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ, కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాయల శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేస్తూ పబ్బం గడుపుతోందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ వర్గాలనే కాకుండా ప్రతి ఒక్కరిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. మా తెలంగాణ మాకొస్తే మా ఉద్యోగాలు మాకు వస్తాయని అనుకున్న ఉద్యమకారులకు మొండి చేయి చూపించారని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఏండ్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయకుండా తాత్సారం చేస్తూ, వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు 3 వాగ్దానాలు చేయడం ఎన్నికల అయిన తర్వాత ముఖం చాటేయడం కేసీఆర్‌కు అలవాటయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ముకుంద్ రావు, అజయ్, భూమారెడ్డి, రఘుపతి, విఠల్, సిద్ధు, రాజు రమేష్ పాల్గొన్నారు.

తాడిహత్నూర్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్‌లో శుక్రవారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డా.బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలను గుర్తు చేశారు. జయంతి సందర్భంగా యువకులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గురించి రచించిన పాటలపై నృత్యాలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులతో పాటు గ్రామంలోని వివిధ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

రామకృష్ణాపూర్ : పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని 18వ వార్డు కౌన్సిలర్ ఎర్రబెల్లి గంటాలమ్మ-మూర్తి, యువనాయకులు కొండ కుమార్ వార్డులో శుక్రవారం గడప గడపకు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశానుసారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బత్తుల శ్రీనివాస్, యువ నాయకులు పాసికంటి శ్రీనివాస్, ఇబ్రహీం, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనమివ్వాలి

జన్నారం : రేషన్ డీలర్లకు గౌరవ వేతన ఇవ్వాలని రేషన్ డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సాగర్‌రావు అన్నారు. శుక్రవారం మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలో నిర్మల్ తరలి వెళ్లారు. నిర్మల్ పట్టణంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 5 నుంచి నిరవధిక సమ్మెను ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్లకు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు రమేష్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థి ప్రాణం తీసిన మోటార్‌సైకిల్

నవతెలంగాణ - బెజ్జూర్



వేసవి సెలవుల్లో సరదాగా గడపాల్సిన విద్యార్థి మోటార్ సైకిల్ నేర్చుకుందామన్న ఆశతో ప్రమాదానికి గురై మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుకుడ, పోతపెల్లి ప్రధాన రహదారిపై గల విద్యుత్ స్తంభానికి ఢీకొని కుకుడ గ్రామానికి చెందిన పెద్దల నితీష్(16) మృతి చెందాడు. సోదరుడు పెద్దల నిశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మోటార్ సైకిల్‌పై శుక్రవారం బారెగూడెం వైపు వెళుతుండగా కొర్తెగూడెం సమీపంలో కరెంటు స్తంభానికి మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే నితీష్ మృతి చెందగా, సోదరుడు నిశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన నిశ్వంత్‌ను కాగజ్‌నగర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. నితీష్ మండలంలోని సలుగుపెల్లి ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. నిశ్వంత్ ఉట్నూర్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చారు. సరదాగా మధ్యాహ్నం వేళ మోటార్ సైకిల్ నేర్చుకుందామనుకొని ప్రమాదానికి గురయ్యారు. అన్నదమ్ముల్లో ఒకరు మరణించగా మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలు కావడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు పెద్దల కలంగిర్-లక్ష్మి బోరున విలపించారు. కుకుడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలి



నవతెలంగాణ - జైనూర్

నేటి యువత అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని చదివి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చర్చి ఫాస్టర్ కంటె ఏలియా అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ప్రజా జీవిత అవసరాలు తీర్చే భారత రాజ్యాంగం ఒక విశ్లేషణ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత అంబేద్కర్ రాసిన పుస్తకాన్ని చదివి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన ఉంటే స్వయం రక్షణలో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అప్పటి కాలంలో అంబేద్కర్ భారతీయ పౌరుల కోసం హక్కులు కల్పించడానికి ఎన్నో చట్టాలను రాశారని తెలిపారు. అలాంటి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ప్రత్యేక చట్టాలపై నూతన పుస్తకాలు రాసినట్టు పేర్కొన్నారు. గిరిజనులకు చట్టాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ప్రాంత ప్రజలకు ఉచితంగా చట్టాలపై రాసిన పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్ష బాధిత రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ - భీమిని

ఇటీవల అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కొండు బానేష్ అన్నారు. శుక్రవారం వడాల గ్రామంలో ఏఐకెఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బానేష్ మాట్లాడుతూ వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను వ్యవసాయాధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని తెలిపారు. మామిడి తోటకు ఎకరానికి 50వేలు, వరికి 30వేలు, మొక్కజొన్నకు 20వేలు, కూరగాయల తోటలకు 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశువులు మరణిస్తే 30వేలు నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షులు కామెర విఠల్, మొండక్క, స్వరూప, అంకుష్, డోకే బక్కయ్య, ఎల్లుల శ్రీనివాస్, చెన్నమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

12వ రోజుకు వీఓఏల సమ్మె



నవతెలంగాణ - కౌటాల

వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొదలుపెట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వీఓఏలు మండల కేంద్రంలో తిరుగుతూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములె దత్తు, మండలాధ్యక్షుడు ఎర్రోల్ల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి మహేశ్వరి, పద్మ, ప్రతిభ, కొండయ్య, భీంరావు, సురేష్ పాల్గొన్నారు.

వాంకిడి : ఐకేపీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న వీఓఏల సమ్మె కొనసాగుతోంది. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వీఓఏలు తెలిపారు. సమ్మెలో వీఓఏలు ఆనంద్‌రావు, రాజేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

ఆకాశవాణి సేవలను వినియోగించుకోవాలి

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించే ఆకాశవాణి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లోని ఆకాశవాణి కేంద్రంలో ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్‌ను పర్చువల్ ద్వారా ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించగా, దీన్ని స్థానికంగా ఎంపీ సోయం బాపురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లోని ఆకాశవాణి ఎఫ్ఎం ట్రాన్స్‌మిటర్ సామర్థ్యాన్ని పెంచాలని సమాచార శాఖా మంత్రి అనురాగ్‌సింగ్ టాకూర్‌ను స్థానిక నాయకులు కోరగా, స్పందించిన ఆయన దీని సామర్థ్యాన్ని పెంచారని తెలిపారు. దేశవ్యాప్తంగా 91 కేంద్రాలను ఈ రోజు ప్రధాని మోడీ ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా అనేక విషయాలు ప్రజలకు తెలిసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 100.1 మెగా హెడ్జ్‌తో 20కిలోమీటర్ల వరకు ప్రసారాలు అందనున్నాయని, త్వరలోనే దీని సామర్థ్యం మరింత పెంచేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు



కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ ఇంజనీర్ నౌషీ నాయక్, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ కె రామేశ్వర్, బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

గిరిజనుల పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించిన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అన్నారు. శుక్రవారం గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పాఠశాలలలో గిరిజన పిల్లల నమోదు, గిరిజన రైతులకు ప్రభుత్వం నుండి అందించే రాయితీ, స్ప్రింకర్లు, వ్యవసాయ పనిముట్లు అందించడంతో పాటు పంట సాగుపై అత్యాధునిక మెలకువలను తెలియజేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గిరిజనులలో విదేశీ విద్య అందించడం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూత పథకంలో లబ్ధి పొందుతున్న వారి వివరాలతో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. పది సంవత్సరాలుగా అర్హులైన గిరిజనులకు అందించిన ఇంటి పట్టాల వివరాలతో పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా గిరిజనులకు అందుతున్న బియ్యం, సరుకులు పొందుతున్న వారి వివరాలతో నివేదిక తయారు చేయాలని తెలిపారు. గిరిజన ఆవాస్ గ్రామాలలో మంచినీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఆదేశాల మేరకు గిరిజనులకు 57 అంశాలలో లబ్ధి చేకూర్చడం జరుగుతుందని, వాటి వివరాలతో నాలుగు రోజులలో పూర్తిస్థాయి నివేదిక రూపొందించినట్లయితే జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌కు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మణెమ్మ, సిపిఓ రవీందర్, డిఎస్పి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - కౌటాల

ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు కౌటాల శాఖ మేనేజర్ నరసింహస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపెల్లి గ్రామంలో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన పథకాల గురించి వివరించారు. 18 సంవత్సరాల వయసు నుండి 50 సంవత్సరాల వయసు వరకు ఈ రెండు పథకాలను అందరు కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాల వయసు నుండి 70 సంవత్సరాల వయసు వరకు సురక్షా బీమా యోజన పథకాన్ని కలిగి ఉండాలని తెలిపారు. సురక్షా బీమా పథకానికి సంవత్సరానికి గాను రూ.20 ప్రీమియం చెల్లించి రూ.రెండు లక్షల ప్రమాద బీమా పొందవచ్చని, జీవనజ్యోతి బీమా యోజన పథకంలో రూ.436 ఒక సంవత్సరానికి ప్రీమియం చెల్లించి సాధారణ లేదా ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. ఈ పథకంలో చేరడానికి ఖాతాదారుల ఖాతాలో డబ్బులు నిల్వ ఉంచుకుంటే దానికదే రెన్యూవల్ అవుతుందని సూచించారు. ఉదయం సమయంలో గ్రామస్తులంతా ఉపాధిహామీ పనికి వెళ్లడంతో ఉపాధిహామీ పని చేసే చోటనే ఈ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రాజేష్, మొగడ్‌దగడ్ సీఎస్‌పీ మొరేశ్వర్, తాటిపెల్లి సర్పంచ్ సోయం సురేష్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా ద్వితీయ మహాసభలు



నవతెలంగాణ - హాజీపూర్

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యుజె) మంచిర్యాల జిల్లా మహాసభ శుక్రవారం జిల్లా కేంద్రంలోని సురభి గ్రాండ్ కన్వెన్షన్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా టీయుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కే.విరాహత్ అలీ హాజరయ్యారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పథకం ప్రకారం మీడియా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న పాలకుల కుట్రలను పోరాటాలతోనే ఎదుర్కోవాలన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన సంఘం జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు సాధించడంతో పాటు వారి హక్కుల పరిరక్షణ, భావప్రకటన స్వేచ్ఛ కోసం అహర్నిశలు పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ ఐక్యత, పోరాటాలు, త్యాగాల పునాదులపై ఐజేయూ, టీయుడబ్ల్యుజె సంఘాలు నిర్మాణమైనట్లు తెలిపారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఇండ్లు, ఆరోగ్య భద్రతా, విద్య తదితర సంక్షేమ పథకాల సాధనకు పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సతీష్, జిల్లా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు మాంతయ్య, వంశీకృష్ణ, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం బాధ్యుడు సంపత్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు రమేష్‌రెడ్డి, శ్రీనివాస్, ఆకుల రాజు, సురేష్ చౌదరి, దేగ సత్యం, సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జీవిత లక్ష్యాలను అధిగమించాలి

- అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థులు జీవిత లక్ష్యాలను అధిగమించాలని అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అన్నారు. కాగజ్‌నగర్‌లోని డీఆర్‌సీలో నిర్వహిస్తున్న పాలిసెట్ శిక్షణ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో సమయం వృధా చేసుకోకుండా, ప్రతీ నిమిషాన్ని చదువు కోసం కేటాయించాలని అన్నారు. రాబోయే మూడు, నాలుగేళ్ళ జీవితంలో చాలా కీలకమని అన్నారు. పాలిసెట్‌లో మంచి ర్యాంకు సాధించి, పాలిటెక్నిక్‌లో మంచి కోర్సులో చేరేలా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం కో కన్వీనర్, ఎంఈఓ గడ్డం భిక్షపతి, కో ఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, సబ్జెక్టు ఉపాధ్యాయులు బత్తుల శాంతికుమార్, దుర్గం మోహన్, ఎండి సాబీర్, మామిడాల శ్రీశైలం, తిరుపతయ్య, పీవీ కిషన్‌రావు, ఎం రాజకమలాకర్‌రెడ్డి, వేణు, తిరుపతి పాల్గొన్నారు.

30న టీఏజీఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

- రాష్ట్ర కమిటీ సభ్యురాలు కోరింగ మాలశ్రీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవనంలో ఈ నెల 30న నిర్వహించే తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కోరింగ మాలశ్రీ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆదివాసులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు చేశామని, ముఖ్యంగా పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఆదివాసీ గ్రామాలలో మౌళిక సదుపాయాల కోసం కృషి చేశామన్నారు. నాణ్యమైన విద్యా, వైద్య సదుపాయాల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గత కార్యక్రమాలను సమీక్షించి, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయడానికి జిల్లా మహాసభలు ఉపయోగపడతాయని వివరించారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుండి ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి నేర్పల్లి అశోక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు కల్పించిన అంబేద్కర్ కలం

- ఉమ్మడి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆజ్మీర శ్యాంనాయక్



నవతెలంగాణ - జైనూర్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే నేటి ప్రపంచంలో ప్రతి ఒక్క పౌరుడికి హక్కులు కల్పించబడ్డాయని ఉమ్మడి జిల్లా గెజిటెడ్ అధికారుల జిల్లా అధ్యక్షుడు ఆజ్మీర శ్యాంనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ మెమోరియల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 132వ అంబేద్కర్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరు విద్యావంతులై అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని చదవాలని తెలిపారు. దేశానికే అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రధాన చౌరస్తా గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ ఆవరణలో సవాలి కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కనక యాదవ్‌రావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చిర్లె లక్ష్మణ్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, జాడి రవీందర్, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కామ్లె అన్నారావు, నాయకులు గైక్వాడ్ సతీష్, నితిన్, కిరణ్, వెంకటేశ్, ఆనంద్‌రావు, దత్త పలువురు మహిళలు పాల్గొన్నారు.

మే డే వారసత్వాన్ని కొనసాగించాలి



నవతెలంగాణ-నస్పూర్

మే డే వారసత్వాన్ని కొనసాగించాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెరుగుదలకు పోరాడాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయు) రాష్ట్ర అధ్యక్షులు డి బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలో మే డే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మే డే స్ఫూర్తిని దెబ్బతీస్తుందని, 8 గంటల పని దినం కోసం పోరాడి అమరులైన వారి త్యాగాన్ని అవమాన పరుస్తుందన్నారు. దానిలో భాగంగానే పెట్టుబడిదారులకు అనుకూలంగా 12గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్మిక చట్టాలను సవరించి 1926 బ్రిటిష్ కాలంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులపై దాడిని కొనసాగిస్తోందని మండిపడ్డారు. కనీస వేతనాల జీవోలను సైతం సవరించకుండా ఏండ్ల తరబడి పెండింగ్‌లో పెడుతోందని పేర్కొన్నారు. చికాగో అమరుల స్ఫూర్తితో మే డే వారసత్వాన్ని కొనసాగించాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెరిగే వరకు పోరాడాలని, మే ఒకటో తేదీన వాడవాడలా కార్మిక క్షేత్రంలో ఎర్రజెండాలు ఎగురవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిసిడబ్ల్యుయు- ఐఎఫ్టీయు నాయకులు అప్పారావు, రాంబాబు, శంకర్, సుధాకర్, బడుగు స్వామి, సమ్మయ్య, సురేష్, ఎల్లయ్య, విజయేందర్, శ్రీను, శారద, లక్ష్మి, స్వప్న, మల్లేశ్వరి, కవిత, సత్య, శిరీష పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ ప్రజలకు సుమన్ చేసిందేమిటి?



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఎమ్మెల్యే బాల్క సుమన్ పట్టణ ప్రజలకు చేసిన అభివృద్ధి పనులు ఏమున్నాయో తెలపాలని టిడిపి పెద్దపల్లి పార్లమెంట్ యూత్ అధ్యక్షులు సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి కట్టడానికి 10 సంవత్సరాలు దాటుతున్నా ఇంకా పూర్తి కాలేదన్నారు. ఆర్కే-1ఏ బొగ్గు గనిని ఓపెన్ కాస్ట్ కాకుండా ఆపాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ పేరు మీద ఇంటింటికి మంచి నీరు అంటూ రోడ్లన్నీ తవ్వారు తప్ప నీరు రావడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలను మోసం చేయడం మానుకోవాలని, రానున్న కాలంలో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇన్‌చార్జి వాసాల సంపత్, పట్టణ ఉపాధ్యక్షుడు గిర్నాల శ్రీనివాస్, ఎండీ జలీల్, జిల్లా నాయకుడు రాజేశ్వరరావు, మందమర్రి పట్టణ అధ్యక్షులు జక్కుల సమ్మయ్య రాష్ట్ర మహిళా నాయకురాలు ఎండి షరీఫా, మందమరి పట్టణ ఇన్‌చార్జి ముల్కల లక్ష్మీరాజం పాల్గొన్నారు.

నూతన జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎంవి రమేష్‌ను ఎస్పీ సురేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. ఇప్పటివరకు జిల్లా జడ్జిగా పనిచేసిన రవీంద్ర శర్మ జనగాంకు బదిలీపై వెళ్లారు.



అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 32 ఎన్సీసీ బెటాలియన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎన్‌సీసీ అధికారులుగా పదోన్నతి లభించిన పలువురు ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వికాస్, సుబేదార్ మేజర్ సతీష్ కుమార్ చేతుల మీదుగా బాధ్యతలు చేపట్టగా వారిని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు. ఎండీ అన్వర్ అలీ, సాయినాథ్‌లకు అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్లుగా పదోన్నతి లభించిందని తెలిపారు.

ఎన్‌హెచ్-63 బాధితుల మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-హాజీపూర్

ఎన్‌హెచ్-63 బాధితుల సంఘం మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుడిపేట్‌కు చెందిన కందుల రమేష్, జనరల్ సెక్రటరీగా హాజీపూర్ చెరకు శ్రీనివాస్, కోశాధికారిగా భూమయ్య, ఉపాధ్యక్షులుగా అంకం శ్రీనివాస్, రమేష్‌తో పాటు 11మందితో కూడిన పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ మండలంలో ఇండ్లు, భూములు కోల్పోతున్న బాధితుల పక్షాన న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. న్యాయమైన పరిహారం అందేవరకు నిరాహార దీక్షలకు సిద్ధమని పేర్కొన్నారు.

భిక్షాటన చేస్తూ వీఓఏల నిరసన



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు గత 11 రోజులుగా ఏకధాటిగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం సమ్మె శిబిరంలోనే వీఓఏలు బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న ఉద్యోగుల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు తగదని వెంటనే గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే సీఎం కేసీఆర్ నెరవేర్చాలని అన్నారు. 11వ రోజున రెడ్డి సంఘం అధ్యక్షులు నిమ్మల సుదర్శన్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నాయకులు స్వామి మద్దతు తెలిపారు. 11వ రోజు దీక్షల కూర్చున్న వారిలో కాడే రామన్న, జ్ఞానేశ్వర్, కాడే రాధిక, స్వామి, పలువురు వీఓఏలు ఉన్నారు.

భైంసా: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు చేపడుతున్న సమ్మె శుక్రవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వీఓఏలు భైంసాలోని తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తాము వెట్టి చాకిరి చేస్తున్నామని, తమను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అభయహస్తం డబ్బులను పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జయశీలతో పాటు మండల వీఓఏలు పాల్గొన్నారు.

కాసిపేట: వీఓఏలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కావాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ను గద్దె దించితేనే సాధ్యమని బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ బాధ్యులు కొయ్యల ఏమాజీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షలు చేస్తున్న వీఓఏలకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏమాజి మాట్లాడుతూ వీఓఏలు చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని అన్నారు. కేసిఆర్‌కు ఆయన కుటుంబ ఆస్తులను పెంచుకోవడానికి తప్ప ఉద్యోగుల బాధలు చూసే తీరిక లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అట్కపురం రమేష్, మండల ఉపాధ్యక్షులు పోషం, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్దన్, కన్నెపల్లి మండల అధ్యక్షులు బేరే రామన్న యాదవ్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, అజ్మీరా శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వడ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సర పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుగా పాఠశాలకు చేరుకొని సందడి చేశారు. 23 సంవత్సరాల తరువాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఎన్నో మధురస్మృతులు గుర్తు చేసుకుంటూ ఆట పాటలతో సరదగా గడిపారు. జీవితంలో స్నేహం ఎప్పటికి శాశ్వతమని తెలియజేశారు. కష్టసుఖాలలో ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని ఆకాంక్షించారు.

మైనింగ్ స్టాఫ్ సమస్యల్ని పరిష్కరించాలి

నవతెలంగాణ- నస్పూర్

గనులలో మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని బెల్లంపల్లి రీజియన్ ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి వంగరి రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం సిసిసిలోని శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేటీకే8 ఇంక్లైన్‌లో జరిగిన ప్రమాదానికి బాధ్యున్ని చేస్తూ ప్రకాష్‌ను డిస్మిస్ చేయడం జరిగిందని, ఈ విషయంపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలుపుతూ, డైరెక్టర్ బలరాం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రకాష్‌ను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారని వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బలరాంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మైనింగ్ స్టాప్ అండర్ గ్రౌండ్ లో అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని, 2012 సర్క్యులర్ ప్రకారం కొనసాగించాలని వారు పేర్కొన్నారు. సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇవ్వకుండా యాజమాన్యం మైనింగ్ స్టాఫ్ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి మైనింగ్ స్టాఫ్ సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డైరెక్టర్ కోరారు. మైనింగ్ స్టాఫ్ సమస్యలపై టీబీజీకేఎస్ నాయకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ మారపల్లి బాబు, మందమర్రి మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ గోపతి సత్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్, సదయ్య, శంకరయ్య, చంద్రమౌళి, సాయిబాబా, పవన్ కుమార్, సాజిద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రకుల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

దశాబ్దాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల ఓట్లతో గద్దెనెక్కుతున్న అగ్రకులాల ఆదిపత్యానికి అడ్డుకట్ట వేసేలా అందరూ మేల్కొనాలని దళిత శక్తి ప్రోగ్రాం మండల అధ్యక్షుడు అరవింద్ మహారాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ భవన్‌లో విశారదన్ మహారాజ్ పదివేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా ఆంధ్రప్రాంత పాలకులు, తెలంగాణ ప్రజలను దోపిడి చేశారని అన్నారు. దొరలకింద వారి పాలన కింద రెండు వేల సంవత్సరాలుగా నలిగిపోయిన బీసీ, ఎస్సీ, ఎస్టీలు స్వరాజ్యాన్ని నిర్మించుకోనేలా విశారదన్ మహారాజ్ పాదయాత్ర ద్వారా ప్రజలను మేల్కొపరాని అన్నారు. తెలంగాణలోని మూడు కోట్ల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు తమ రాజ్య స్థాపన కోసం సిద్ధం కావాలని ఆదివారం హైదరాబాద్‌లో జరగనున్న ముగింపు కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి వేల సంఖ్యలో ప్రజలు తరలివెళ్లి విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో దళిత శక్తి ప్రోగ్రాం నాయకులు పాల్గొన్నారు.

విలీన వార్డుల్లో అర్హులైన లబ్దిదారులకు పథకాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపాలిటీలో విలీనమైన వార్డుల్లో అర్హులైన లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరుతో పాటు గృహలక్ష్మి పథకాన్ని అందే విధంగా పూర్తి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. శుక్రవారం కైలాస్‌నగర్‌లో ఆయా వార్డుల ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ, గృహ లక్ష్మి పథకం లబ్దిదారుల ఎంపిక తదితర అంశాలపై చర్చించారు. గతంలో మావల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆయా వార్డులు మున్సిపాలిటీలో విలీనమైన నేపథ్యంలో సంబంధిత వార్డుల్లోని అర్హులైన లబ్దిదారులు ఎటువంటి ఆందోళన చెందే అవసరం లేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి అర్హులను పూర్తి పారదర్శకంగా ఎంపిక చేస్తామని వివరించారు. అధికారులతో ఫోన్ ద్వారా పలు అంశాలపై చర్చించి, వారికి సూచనలు చేశారు. నిరుపేదలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భరత్, నాయకులు గంగారెడ్డి, అశోక్, రాంకుమార్ పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు

- రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అన్నారు. శుక్రవారం రైల్వే స్టేషన్‌లో సిబ్బంది కోసం నిర్మించిన ట్రిప్ టూ క్వార్టర్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పించిన వసతులను పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. అనంతరం రైల్వే పిట్‌లైన్ పనులను పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను అధికారులు జీఎంకు వివరించారు. ఇదిలా ఉంటే పలు సమస్యలపై బీజేపీతో పాటు పౌర సమాజ్ సభ్యులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు జీఎంను కలిసి వినతిపత్రాలు అందించారు. రైళ్లను పొడగించడంతో పాటు ట్రాక్‌కు అవతల ఉన్న కాలనీవాసుల సౌకర్యార్థం ఓవర్ ఫుట్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు. పౌరసమాజ్ సభ్యులు గజేందర్ పటస్కర్, రాజేందర్ రైళ్లను పొడగించడంతో పాటు ప్రయాణికులకు మరింత సేవలను మెరుగు చేయాలని కోరారు. అదే విధంగా రైల్వే స్టేషన్ ప్రహరీకి అనుకొని పార్కింగ్ చేసేల అవకాశం కల్పించాలని కోరుతూ లారీ ఓనర్స్ సభ్యులు వినతిపత్రం అందించారు. సమస్యలపై స్పందించిన తన వంతుగా సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో ఆదిలాబాద్ స్టేషన్ ఎంపికైందని అన్నారు. ఈ పథకంలో స్టేషన్‌లో మరింత సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. రైల్వే పిట్‌లైన్ పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. రైళ్ల పొడగింపు అంశం తమ దృష్టిలో ఉందని, సాధ్యమైన రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. గతంలో పర్యటించిన సందర్భంగా గుర్తించిన సమస్యలను ఇక్కడి అధికారులు పూర్తి చేశారని అన్నారు. ఆదిలాబాద్ వాసులకు మరింత సౌకర్యాలు స్టేషన్‌లో కల్పించేలా కృషి చేస్తామని అన్నారు. జీఎంతో పాటు పలువురు అధికారులు, రైల్వే సిబ్బంది ఉన్నారు.

ఆదిలాబాద్ నుండి మరిన్ని రైల్వే సర్వీసులు పెంచాలి...

ఆదిలాబాద్ పట్టణానికి శుక్రవారం విచ్చేసిన రైల్వే అధికారి అరుణ్ జైన్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలో రైల్వేకు సంబంధించిన పలు సమస్యల మీద వారితో చర్చించారు. ఆదిలాబాద్ నుండి దేశంలోని ముఖ్య నగరాలకు వాణిజ్య ప్రాంతాలకు నేరుగా రైల్వే సర్వీస్‌లను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌కు కేటాయించిన రైల్వే పిట్‌లైన్ పనులను ప్రారంభించాలని కోరారు. దీనికి అరుణ్ జైన్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానని అన్నారు. అధికారులను కలిసిన వారిలో జిల్లా నాయకులు ముకుంద్ రావు, విఠల్, అజయ్, సిద్దు కార్యకర్తలు ఉన్నారు.

ఇండ్ల పంపిణీలో అధికార ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉండదు

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-జైనథ్

ప్రభుత్వం నుండి అందిస్తున్నటువంటి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో అధికార ప్రతినిధుల ప్రమేయం ఉండదని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండలంలోని మేడిగూడలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని ప్రసంగించారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని కార్యకర్తలను ఉద్దేశించి ప్రభుత్వ పథకాలు వాటి కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరుస ఎన్నికల నేపథ్యంలో కరోనా కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కొంత తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికిని ప్రజా సంక్షేమానికి అందించాల్సిన సంక్షేమ పథకాలను అందించిందని అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రజల నుండి టాక్స్‌లు వసూలు చేస్తూ డబ్బులు దండుకుంటోందని అన్నారు. ఇలాంటి తరుణంలోనే గ్రామ కమిటీలు చురుకుగా పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం మధ్య ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను చర్చ జరపాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కానీ పథకాలు సైతం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. త్వరలోనే పేదలకు అందించాల్సిన ఇండ్ల పంపిణీ కార్యక్రమం మొదలు చేసుకొని సొంత స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, ఈ పంపిణీలో అధికార ప్రతినిధుల ప్రమేయం ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి, మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



'రేవంత్‌రెడ్డి అంబేద్కర్‌ను అవమానపర్చలేదు'



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రేవంత్‌రెడ్డి రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌ను అవమానపర్చలేదని, అధికారపార్టీ అండతో కొంతమంది అంబేద్కర్‌వాదులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. నిరుద్యోగ నిరసన ర్యాలీ జిల్లాకేంద్రంలో విజయవంతమైందని అన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రేవంత్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పించలేదని, ఆయన దళిత ద్రోహి అంటూ కొందరు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆయన తరపున కాంగ్రెస్ నాయకుడు శివాజీ కాంబ్లే పూలమాలవేసి నివాళ్లర్పిస్తారని సభావేదిక సాక్షిగా తమ డీసీసీ అధ్యక్షుడు ప్రకటించారని అన్నారు. కావాలనే కాంగ్రెస్‌పై, తమ రాష్ట్ర అధ్యక్షుడిగాపై బురదజల్లడం కోసం లేనిపోని ఆపోహలను సృష్టిస్తున్నారని ఆరోపించారు.

జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వవిప్ బాల్క సుమన్, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జీ నాదాసు లక్ష్మణ్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు. క్యాతన్ పల్లిలోని బాల్క సుమన్ నివాసంలో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట్ల మల్లేష్ యాదవ్, గోపతి సత్తయ్యలు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన జర్నలిస్టులు స్వరాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక అద్దె ఇంట్లో ఉంటూ దుర్భర జీవితాలు గడుపుతున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టులు ఎన్నో ఏండ్లుగా ప్రభుత్వం నుండి ఇల్లు, ఇండ్ల స్థలాలు పొందేందుకు ఆశగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. చాల మంది జర్నలిస్టులు పేదరికంలో సొంత ఇల్లు లేక అద్దె ఇండ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో గత 15 సంవత్సరాలుగా ఇండ్ల స్థలాలు మంజూరు చేయలేదని తెలిపారు. అదేవిధంగా రైల్వే పాస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. బస్ పాస్, రైల్వే పాస్ రాయితీపై వంద శాతం రాయితీ కల్పించేలా కృషి చేయాలని కోరారు. జర్నలిస్టులు ఆర్టీసీ బస్ పాస్ రాయితీని జర్నలిస్ట్ కుటుంబాలకు వర్తింపచేయాలని తెలిపారు. అదేవిధంగా జర్నలిస్టులకు టోల్ గేట్ ఫీజు నుండి మినహాయింపు ఇవ్వాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు రాత్రిపూట భద్రత కల్పించడంతో పాటు, జర్నలిస్టులందరికి "జర్నలిస్టుబంధు" పథకం ప్రవేశ పెట్టాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరారు.



జర్నలిస్టులకు అండగా ఉంటాం..

జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలన్నీ తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వం విప్ బాల్క సుమన్‌లు హామీ ఇచ్చారు. ముందుగా జర్నలిస్టులు సమస్యలను ఓపికతో విన్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వేరే ఇతర జిల్లాలలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చరవాణి ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి నవీన్ విఠల్‌కు, సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులకు ఫోన్ చేసి జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. అదేవిధంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ దృష్టిలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు కామెర వెంకట స్వామి, మధులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించిన డైరెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్‌ను డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర రెడ్డి జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నూతనంగా సుమారు రూ.20లక్షలతో నూతన కాన్ఫరెన్స్ హాల్‌ను నిర్మించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులు ఈ కాన్ఫరెన్స్ హాల్‌ను ఉపయోగించుకోవాలని, ఈ కాన్ఫరెన్స్ హాల్‌ను నూతన అధునాతన వసతులను కల్పించడం చాలా సంతోషకరమైన విషయమని తెలియజేశారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూ జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించుకునే వివిధ సమావేశాలకు, అలాగే పదవీ విరమణ కార్యక్రమాలు, కారుణ్య నియామక పత్రాల అందజేత, సభలకు, సమావేశాలకు ఈ కాన్ఫరెన్స్ హాలు ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, అధికార సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, ఫైనాన్స్ మురళీధర్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి, ఎస్ఆర్పి గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, డీజీఎంలు అరవిందరావు, శివరావు, చిరంజీవి, డివై సిఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, ఎస్పీ పర్చేస్ చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ వరలక్ష్మి, టీబీజీకేఎస్ నాయకులు, శ్రీరాంపూర్ ఏరియా అన్ని విభాగాల అన్ని గనుల మేనేజర్లు పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న కిర్గుల్ గ్రామస్తులు



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని కిర్గుల్(బి) గ్రామస్తులు మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం వీడీసీ ఆధ్వర్యంలో జమ చేసిన రూ.1లక్ష ఇరవై ఐదు వేలను కారండి గంగన్న గోదావరి దంపతులకు అందజేశారు. రెండు రోజుల కింద కిర్గుల్(బి) గ్రామంలో గుర్తుతెలియని దొంగలు కారండి గంగన్న ఇంటిలోని రూ.50 వేల నగదును, తులంన్నర బంగారాన్ని దోచుకెళ్లారు. మే 7న వారి కుమార్తె వివాహానికి సంబంధించిన కట్నం డబ్బులు బంగారాన్ని దొంగలు దోచుకెళ్లడంపై గ్రామస్తులు స్పందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ముందుకు వచ్చి రూ.1లక్షా 25వేలు పోగు చేసి వారి కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యలను పరిష్కారం కోసం రేషన్ డీలర్లు కదంతొక్కారు. చలో నిర్మల్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సభకు ఆదిలాబాద్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మండలాల రేషన్ డీలర్లు బయలుదేరి వెళ్లారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని గత కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సంఘం అధ్యక్షులు వేణుగోపాల్ మండిపడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే సభలో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. పలు తీర్మానాలు చేసి రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

జేఎల్, డీఎల్ పరీక్షలపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జేఎల్, డీఎల్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్సెస్ డిగ్రీ కళాశాలలో పలు అంశాలపై వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యంగా జనరల్ స్టడీస్, వివిధ సబ్జెక్టులలో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ జగ్‌రామ్ అంతర్వేది, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్‌రావు, శ్రీనివాస్, రఘునాథ్, సంతోష్‌కుమార్, జాకీర్ హుస్సేన్ అభ్యర్థులు పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన డీఐజీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వరంగల్ జిల్లా జైళ్లశాఖ డీఐజీ డా.డి.శ్రీనివాస్ ఆదిలాబాద్ జిల్లా జైలును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జైల్లో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి వినయాస, జైలర్లు సూర్యప్రకాష్ రెడ్డి, మధు, డిప్యూటీ జైలర్లు ప్రకాష్, కృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మంగ్లీ గ్రామాన్ని సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని వాన్‌వాట్ గ్రామం పంచాయతీ పరిధిలోని మంగ్లీ గ్రామాన్ని శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ సందర్శించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామానికి రహదారి లేకపోవడం11 కుటుంబాలు ఉండటం ఆదిలాబాద్‌కి వెళ్లాలంటే ఆ గ్రామానికి రావాలంటే కష్టంగా ఉందని మంగ్లీ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వాన్వాట్ అంగన్వాడీ భవనాన్ని పరిశీలించి, అంగన్‌వాడీ టీచర్ గ్రామస్తులతో మాట్లాడారు. పై అధికారులతో చర్చించి, వాన్వాట్ గ్రామ సమస్యలు తీరుస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సల్లావుద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లోని సిబ్బందికి హెచ్‌ఆర్ పాలసీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రాథమిక సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసిందని జిల్లా సహకార అధికారి ఎన్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డీసీఓ కార్యాలయంలో ఉద్యోగులకు సర్వీస్ పుస్తకంతో పాటు ఇతర పత్రాలను అందజేశారు. 2022 డిసెంబర్ 28న ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బంది, ఉద్యోగులకు భద్రత నిమిత్తం జీఓ 44ను విడుదల చేసిందని డీసీఓ శ్రీనివాసరావు తెలిపారు. 31 మార్చి 2019 కట్ ఆఫ్ డేట్‌లో ఉన్న ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీలో తీసుకున్నామని అన్నారు. జనవరి 2023 నుంచి ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు అవుతుందన్నారు. దానికి సంబంధించిన పత్రాలు, విధి విధానాలు, వేతనాల వివరాలతో పాటు సర్వీస్ పుస్తకాలను ఉద్యోగులకు అందించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ అధికారి రాథోడ్ బిక్కు కార్యాలయ సూపరింటెండెంట్లు కళ, విక్రంత్, ముజఫ్ఫర్ హుస్సెన్, ఆత్మరాం, టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ నవీన్ కుమార్, సహకార ఉద్యోగులు పాల్గొన్నారు.